

స్వామి దర్శనంతో ప్రశాంతత

'తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రతిసారి ప్రశాంతత లభిస్తుంది. పీస్ ఆఫ్ మైండ్‌తో తిరిగి ఇంటికి వెళతాం' అని నటి అంజలి అన్నారు. నటుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గురువారం ఉదయం ఆమె స్వామిని దర్శించుకున్నారు. తన సినిమాల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామన్నారు. శ్రీవారి నిజరూప దర్శనం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని నటుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రసాదాలు చాలా బాగున్నాయన్నారు. ఆలయం ముందు వీరిని చూసేందుకు సినీ అభిమానులు పోటీపడ్డారు. సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ముసుగేసిన మంచు





తిరుపతి నగరాన్ని పొగమంచు కప్పేసింది. గురువారం ఉదయం మరింత ఎక్కువగా మంచు కనిపించింది. ఈ మంచు చాటున శేషాచల కొండ, గరుడవారధి, రహదారులు, రైల్వేట్రాక్, బహుళ అంతస్తుల భవనాలు, వాహనాల రాకపోకలు కనువిందుచేశాయి. మంచుతెరల్లో బాల సురీడు రూపం అలరించింది. చలి కాస్త పెరిగింది. ఉదయం 10 గంటల తర్వాత పొంగమంచు వీడి యథావిధి వాతావరణం నెలకొంది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

అలిపిరి పాదాల మండపానికి

పూర్వ వైభవం

సందర్శించిన ఏఎస్ఐ బృందం
త్వరలో ప్రారంభంకానున్న పునర్నిర్మాణం పునులు

తిరుమల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): అలిపిరిలో కూలిపోయే స్థితిలోవున్న పాదాల మండపం ప్రాచీన వైభవం చెక్కుచెదరకుండా పునర్నిర్మాణానికి తొలి అడుగు పడింది. గురువారం ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) అధికారుల బృందం దీనిని పరిశీలించింది. ప్రత్యేక శ్రద్ధతో, శాస్త్రీయ పద్ధతిలో అవే రాళ్లు, స్తంభాలు వినియోగించే మండపాన్ని పునర్నించవచ్చని ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ఆధ్వర్యంలోని బృందం అభిప్రాయపడింది. ఇందుకు రూ. 4కోట్లు వ్యయం కావచ్చని అంచనా వేశారు. పూణేకు చెందిన లార్డ్ వేంకటేశ్వర ఛారిటబుల్ అండ్ రిలీజియస్స్ ట్రస్టు నిర్వాహకులు వెంకటేశ్వరరావు ఈ మొత్తం భరించేందుకు ముందుకు వచ్చారు. శ్రీకాళహస్తిలో రూ.7 కోట్లతో టీకేజీ పనులు, సింహాచలం, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లో మరమ్మతు పనులను పురాతన పద్ధతిలో ఇప్పటికే వీరి ఆధ్వర్యంలో జరిగాయి. పాదాలమండపాన్ని పరిశీలించిన ఏఎస్ఐ బృందంలో బెంగుళూరు డిప్యూటీ ఇంజనీర్ జీ శ్రీనివాసులు, హైదరాబాద్ డిప్యూటీ ఇంజనీర్ కృష్ణచైతన్య కూడా ఉన్నారు. 450 ఏళ్ల క్రితం విజయనగర రాజుల కాలంలో పాదాలమండపాన్ని నిర్మించారు. పదేహేనేళ్లుగా రాళ్లు, పైపెచ్చులు, గోడలు పడిపోతూ ప్రమాదకరంగా మారింది. దీని స్థానంలో కొత్తది నిర్మించాలా, మరమ్మతులు చేయాలా అనే చర్చ జరిగింది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ అధికారులు ఆర్కియాలజీ విభాగం సంప్రతించడంతో ఈ బృందం తిరుపతికి వచ్చింది.



ఒక్క ఇటుకా కదిలించం



పాదాల మండపాన్ని పూర్తిగా కూలదోసి కొత్తది కడతారనే ప్రచారం నిజం కాదు. ప్రస్తుతం ఉన్న నిర్మాణంలోంచి ఒక్క ఇటుకను కూడా కదిలించబోము. ఇందులోని ప్రతీ రాయినీ, స్తంభాన్నీ యదాతదంగా వినియోగించుకుంటాం. వాటిపై నెంబర్లు వేసి తిరిగి వాటితోనే నిర్మాణం జరుగుతుంది. దాతకూడా ముందుకువచ్చారు. విధివిధానాలు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం. పనులు పూర్తయితే మరో 700 ఏళ్ల దాకా అలిపిరి పాదాలమండపానికి ముప్పు ఉండదు.

- మునిరత్నంరెడ్డి, ఏఎస్ఐ డైరెక్టర్

'విశాఖ' ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌లో పొగలు

● గంట ఆలస్యంగా నడచిన రైలు

తిరుపతి(సెంట్రల్), నవంబరు13(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి విశాఖ వెళ్లే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్(08548) ఏసీ కోచ్‌లో పొగలు వచ్చాయి. ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. విశాఖ నుంచి ఈ ప్రత్యేక రైలు గురువారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకొంది. తిరిగి తిరుపతి రైల్వే స్టేషన్‌లో రాత్రి 9.50 గంటలకు 6వ నెంబరు ప్లాట్‌ఫారం నుంచి బయలుదేరాలి. రైలు బయలుదేరిన వెంటనే బి-3 ఏసీ కోచ్‌లో సిబ్బంది ఏసీ ఆన్ చేశారు. ఆన్ చేసిన వెంటనే ప్యానల్ బోర్డులో ఉన్నపళంగా పొగలు రావడంతో ఏసీ సిబ్బంది, ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. సిబ్బంది చాకచక్యంగా చైన్‌పుల్ చేసి రైలును ఆపారు. ఎలాంటి మంటలు చెలరేగక పోవడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు, ఎలక్ట్రికల్, ఇతర సాంకేతిక శాఖల సిబ్బంది అక్కడకు చేరుకొని మరమ్మతులు చేశారు. ఈ రైలు గంటకుపైగా ఆలస్యంతో బయలుదేరినట్లు ప్రయాణికులు తెలిపారు.

164 అదనపు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 164 అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రాష్ట్ర ఎన్నికల అధికారికి ఆమోదం కోసం పంపినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం వివిధరాజకీయ పార్టీల నేతలతో పోలింగ్ కేంద్రాల సరళీకరణపై ఆయన సమీక్షించారు. 1,200 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఈ ప్రతిపాదనలు పంపామన్నారు. 38 పోలింగ్ కేంద్రాల ప్రాంతాలు మార్పు, 9 పోలింగ్ కేంద్రాలు పేరుమార్పు, 44 పోలింగ్ కేంద్రాలు విలీనానికి ప్రణాళికలు సిద్ధంచేశామన్నారు. ప్రస్తుతమున్న 2,141 పోలింగ్‌కేంద్రాలకు గాను 2,261పోలింగ్ కేంద్రాలు పెరుగుతాయన్నారు. దీనిపై రాజకీయపార్టీల నేతలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి జేసీ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాస్‌రెడ్డితో పాటు వివిధ రాజకీయపార్టీల నేతలు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు ఈ ఆటోలు





ఈ ఆటోలను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని 20 గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణకు ఈ-ఆటోలు అందజేశారు. కలెక్టరేట్ వద్ద గురువారం వీటిని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయా పంచాయతీలకు అందజేశారు. దళిత గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు వీటిని తీసుకొచ్చామన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్త సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుశీలాదేవి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీగా శ్రీనివాసులు



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డీజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న శ్రీనివాసులను తిరుపతి జిల్లాకు అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు 16న అంకురార్పణ

తిరుచానూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు 17 నుంచి 25వ తేదీ వరకు జరగనున్నాయి. అందులో భాగంగా 16వతేదీ ఉత్సవాలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. అదేరోజు ఉదయం అమ్మవారి ఆలయంలో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. మరుసటిరోజు 17న సోమవారం ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులోని ఎంకేటీ మహల్‌లో శనివారం నిర్వహించే ఉద్యోగ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. శ్రీసిటీ, మేనకూరుసెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరపతి, చెన్నైలోని 15 బహుళ జాతీయ కంపెనీల్లో సుమారు 760కిపైగా ఉద్యోగాలకోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదేని డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణతసాధించిన వారు ఉదయం 8గంటలకు మేళాలో పాల్గొనవచ్చన్నారు. సంబంధిత లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94403 74535లో సంప్రదించాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



మూడు నెలలకే గుంతలు

● తిరుమల రెండో ఘాట్‌లో తిరిగి మరమ్మతులు

తిరుమల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమల రెండో ఘాట్‌లో కొత్త రోడ్డు వేసి మూడు నెలలు కాకముందే గుంతలయమైంది. భారీ వర్షాలు, అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలతో కొద్ది నెలలకే మరమ్మతులకు గురైంది. కొవిడ్ అనంతరం తిరుమలకు వచ్చే వాహనాల సంఖ్య పెరగడం, వరుస వర్షాలతో తిరుమల మొదటి, రెండో ఘాట్ రోడ్లు భారీగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే దాదాపు రూ.10 కోట్లతో రెండు ఘాట్‌రోడ్ల మరమ్మతుల కోసం టీటీడీ బోర్డు ఈ ఏడాది ప్రారంభంలో తీర్మానం చేసి కాంట్రాక్టు ఇచ్చింది. తొలుత తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్‌లో నూతన రోడ్డు ప్రారంభించి బ్రహ్మోత్సవాల ముందు పూర్తి చేశారు. పూర్తిస్థాయిలో ఘాట్‌రోడ్డు సిద్ధమైందనుకున్న లోపే ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. దీంతో నూతన రోడ్డులోనూ గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో టీటీడీ తిరిగి మరమ్మతు పనులను ప్రారంభించింది. వర్షాలు అధికంగా కురవడం, నేషనల్ హైవే కంటే అధికంగా వాహనాల రాకపోకలు ఉన్న క్రమంలో రోడ్డు దెబ్బతిందని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం సాయంత్రానికి ఈ మరమ్మతులు పూర్తవుతాయన్నారు. మరోవైపు కొత్త రోడ్డు ఇంత తక్కువ సమయంలో పాడవడమేంటనే విమర్శలు వినిపిస్తున్నాయి.

టీడీపీ మండల కమిటీ ఎన్నిక

● నేడు ప్రమాణ స్వీకారం




బాలకృష్ణమూర్తి, ప్రవీణ్ రాయల్

చంంద్రగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం తెలుగు దేశం పార్టీ కమిటీని ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. దీంతో శుక్రవారం తిరుపతి రూరల్‌లోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడిగా ముండ్లూరి బాలకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కొండూరు ప్రవీణ్ రాయల్, ఉపాధ్యక్షుడిగా గోపీనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు మనోజ్‌కుమార్, మునిరత్నంనాయుడు, కార్యదర్శులుగా మండీరావు, కోదండరామిరెడ్డి, కోశాధికారిగా హరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ కమిటీలు, గ్రామ కమిటీలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

చంద్రగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పాతపేటలోని గ్రంథాలయంలో శుక్రవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారిణి రెడ్డమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా 15వ తేదీన పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖుల పాత్ర పోషించిన వారిని సన్మానించడం, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 19న దిశ చట్టంపై అవగాహన, 20న పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

● పాకాల (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామలచెరువు, పాకాల గ్రంథాలయాల్లో 14వ తేది శుక్రవారం నుంచి 20వ తేది వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు పి.మురళీబాబు, రవీంద్రబాబు తెలిపారు. బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత, గ్రంథాలయ ఉద్యమమం, కవి సమ్మేళనాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు. మహిళలకు రంగవల్లులు, అల్లికల పోటీలు జరుపుతామన్నారు. 20వ తేదీన వారోత్సవాల ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన కాలభైరవ హోమం




ప్రత్యేకాలంకారంలో కాలభైరవస్వామి, పూర్ణాహుతి సమర్పిస్తున్న రమ్యానంద భారతి

రామచంద్రాపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శ్రీశక్తి పీఠంలో కాలభైరవ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం కాలభైరవ హోమాన్ని వేదపండితులు పూర్ణాహుతితో ముగించారు. ఈ సందర్భంగా మరకతశక్తి కాళీ అమ్మవారితోపాటు కాలభైరవస్వామికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 9గంటలకు 11వేల గారెలతో వేదపండితులు హోమాన్ని ప్రారంభించగా మధ్యాహ్నం 12గంటలకు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి పూర్ణాహుతితో ముగించారు. వీరు భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ పాల్గొన్నారు.

కారుతో సహా ఎర్రచందనం స్వాధీనం



కార్లతో సహా స్వాధీనం చేసుకొన్న ఎర్రచందనం దుంగలను చూపుతున్న అటవీ అధికారులు, సిబ్బంది

ఎర్రావారిపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కారులో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తుండగా దాడి చేసి స్వాధీనం చేసుకొన్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉస్తికాయల పెంట, ఎల్లమంద గ్రామాల నుంచి కారులో ఎర్రచందనం తరలిపోతుందనే సమాచారం మేరకు మాటువేసినట్లు తెలిపారు. గురువారం వేకువ ఝామున 3 గంటలకు కారుతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొన్నట్లు వెంకటరమణ తెలిపారు. పట్టుబడిన ఎర్రచందనం 150 కేజీలు ఉంటుందన్నారు. ఈ దాడిలో అటవీ సిబ్బంది మునిస్వామి నాయక్, రాజేష్, సదాశివయ్య, రోహిత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఇన్నోవా వాహనంలో 300 కేజీల ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు.

బేటీ బచావో.. బేటి పడావోపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

రామచంద్రాపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లె గ్రామంలో మిషన్ శక్తి - సంబల్ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో చేపట్టారు. గురువారం బలిజపల్లి మోడల్ ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనీలా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, సులోచన, రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది వనిత, భారతి, చిన్నారులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని అమరరాజ ఉద్యోగి దుర్మరణం



గిరిబాబు (ఫైల్ ఫొటో)

ఐరాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొనడంతో అమరరాజ ఉద్యోగి ఒకరు దుర్మరణం చెందాడు. ఐరాల పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఐరాల మండలంలోని పొలకలరెడ్డివారిపల్లె బీసీ కాలనీకి చెందిన గిరిబాబు(29) యాదమరి మండల పరిధిలోని అమరరాజ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం డ్యూటీ ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. గ్రామ సమీపానికి వద్దకొచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. భార్య దీప ఫిర్యాదుతో పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్రౌడ్ కంట్రోల్ మేనేజ్‌మెంట్‌పై తర్ఫీదు అవసరం: ఎస్పీ



తిరుపతి(నేర విభాగం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా పోలీసులకు క్రౌడ్ కంట్రోల్ మేనేజ్‌మెంట్‌పై తర్ఫీదు అవసరమని ఎస్పీ సుబ్బారాయుడు పేర్కొన్నారు. క్రౌడ్ కంట్రోల్ మేనేజ్‌మెంట, రోప్ పార్టీ విధులపై తిరుపతిలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జన సమూహం పెరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోప్ పార్టీ ఏర్పాట్లు, ఎంట్రీ,ఎగ్జిట్ పాయింట్ల మేనేజ్‌మెంట్, ఫైర్ సేఫ్టీ, మెడికల్ ఎమర్జెన్సీ, కమ్యూనికేషన్ కోఆర్డినేషన్ వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగానూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

సామిరెడ్డిఒడ్డు కాలువలో అక్రమ నిర్మాణాల పరిశీలన



సామిరెడ్డిఒడ్డు కాలువలో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న వీఆర్వో

పాకాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక భారతంమిట్టలోని సామిరెడ్డిఒడ్డు కాలువలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. అక్రమ నిర్మాణాలతో పాకాల - ఇరంగారిపల్లె పంచాయతీల పరిధిలోని సామిరెడ్డిఒడ్డు చెరువు కాలువ కనుమరుగవుతోందని గురువారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తహశీల్దార్ సంతోష్‌సాయి రెవెన్యూ సిబ్బందిని పంపి ఆక్రమణలను పరిశీలించారు. కాలువలో వెలసిన అక్రమ కట్టడాలను గుర్తించారు. వాగులు, వంకలు, కుంటలు, చెరువుల స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎర్రావారిపాలెం ఎంపీడీవోగా దివాకర్



ఎర్రావారిపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రావారిపాలెం ఎంపీడీవోగా దివాకర్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సత్యసాయి జిల్లా ముదిగుబ్బం మండలంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నేడు టీడీపీ మండల కమిటీ ప్రమాణస్వీకారం

భాకరాపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు టీడీపీ మండల కమిటీ, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తి నాని కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రమాణస్వీకారం ఉంటుందని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా బెల్లంకొండ మురళి, ప్రధాన కార్యదర్శిగా మదనమోహన్, ఉపాధ్యక్షుడిగా మునస్వామి నాయుడు, కార్యదర్శులుగా వెంకటనాగులు, సుగుణ, పద్మావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రమేశ్‌రెడ్డి, భాస్కరరావు, క్లస్టర్ ఇన్‌చార్జుగా శివకుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులుగా చిన్నగొట్టిగల్లుకు నాగరాజా, భాకరాపేటకు వెంకటరత్నం, దేవరకొండకు శోభన్‌బాబు, చిట్టిచర్లకు చంద్రశేఖర్‌రెడ్డి, దీన్‌దార్లపల్లెకు శివశంకర్, దిగువూరుకు కిశోర్, జంగావాండ్లపల్లెకు నరసింహారెడ్డి, రంగన్నగారిగడ్డకు వెంకటరమణ, చట్టివారిపాళెంకు మురళీమోహన్, తిప్పిరెడ్డిగారిపల్లెకు మునిరామయ్య ప్రమాణస్వీకారం చేయనున్నారు.

ట్రాక్టర్ కింద పడి కూలీ దుర్మరణం




మృతి చెందిన రామచంద్ర, పక్కన (ఫైల్‌ఫొటో)

సోమల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కింద పడి కూలీ దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమల మండలంలో జరిగింది. సోమల ఎస్ఐ శివశంకర కథనం మేరకు.. పేటూరు పంచాయతీ బోనమందకు చెందిన రామచంద్ర పదేళ్లగా మురళీనాయుడు మామిడి తోటలో కూలీగా పనిచేస్తున్నాడు. మామిడి తోటలను తమిళనాడుకు చెందిన కృష్ణగిరి షాజహాన్ లీజుకు తీసుకున్నాడు. ఈక్రమంలోనే మామిడి తోటను దుక్కి చేయడానికి ట్రాక్టర్ డ్రైవర్ కందసేన్ వచ్చాడు. డ్రైవర్ పక్కనే కూలీ రామచంద్ర కూర్చున్నాడు. దుక్కి చేస్తుండగా గుంతలో దిగి ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్ పక్కకు దూకేయడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. రామచంద్ర ట్రాక్టర్ కింద పడి పోవడంతో అక్కడిక్కక్కడే చనిపోయాడు. మృతుడి భార్య రేఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, ఓ కుమారుడు ఉన్నాడు.

పొగ మంచుతో

ప్రమాదాల ముప్పు



చంద్రగిరి జాతీయ రహదారిలో కమ్ముకున్న దట్టమైన పొగమంచు

చంద్రగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తీవ్రమైన చలి, పొగ మంచు కమ్ముకోవడం వలన రోడ్డు ప్రమాదాల ముప్పునెలకొంది. రాత్రి వేళల్లో వాహనాలకు ఉన్న లైటింగ్ కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పొగమంచు ఉదయం 7 గంటల వరకు కమ్మేస్తుంది. 8 గంటల వరకు చలి తీవ్రత తగ్గడంలేదు. 8 గంటల తరువాతనే ప్రజలు వాహన రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిపడినంత లైటింగ్ లేకుండా వాహనాలు వేగంగా నడపడం వలన ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి.

రాత్రిపూట ప్రయాణాలు రద్దు చేసుకోవడం మంచిది

చలికాలం వలన మంచు విపరీతంగా ఉన్నందున వాహనదారులు రాత్రి వేళల్లో ప్రయాణాలు రద్దు చేసుకోవడం మంచిదని చంద్రగిరి సీఐ సురేష్ కుమార్ సూచించారు. అత్యవసర ప్రయాణాలు చేయాల్సి వస్తే వాహనాలు వేగం తగ్గించుకుని నిదానంగా వెళ్లాలని అన్నారు. శ్రీవారి భక్తులు రాత్రి పూట పాదయాత్రను వాయిదా వేసుకుని, పగటి పూట చేస్తే సురక్షితంగా ఉంటారని తెలిపారు.

సుందరగిరి అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజకు

వైభవంగా ధ్వజారోహణం




ధ్వజారోహణం సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

చంద్రగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐతేపల్లె వద్ద వెలసిన సుందరగిరి అయ్యస్వామి ఆలయంలో పడి పూజ మహోత్సవానికి గురువారం సాయంత్రం ధ్వజారోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ శుద్ధి తరువాత అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 7 గంటలకు ధ్వజారోహణం నిర్వహించారు. అయ్యప్పస్వామి నామస్మరణల నడుమ ఆలయ ట్రస్టీ లెక్కల పురుషోత్తం నాయుడు పడిపూజ మహోత్సవానికి ధ్వజపటాన్ని ధ్వజస్తంభం పైకి ఎగురవేశారు. 7.30 గంటలకు దుర్గాపూజ, 8 గంటలకు ప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పురుషోత్తం నాయుడి కుటుంబ సభ్యులు, అర్చకులు త్రివిక్రమ్, గురుస్వాములు వేణుగోపాల్‌నాయుడు, చంద్రాస్వామి, మోహన్‌స్వామి, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

నేడు పడి పూజ మహోత్సవం: సుందరగిరి అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు గణపతిపూజ, 7 గంటలకు పాలాభిషేకం, 8.30 గంటలకు 25 కలశ అభిషేకం, 10 గంటలకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు నైవేద్యం, తీర్థ ప్రసాద కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు దీప హారతి, 5.30 గంటలకు పుష్పాభిషేకం, సాయంత్రం 6 గంటలకు కేరళా తాంత్రికులచే పడిపూజ, రాత్రి 10 గంటలకు ప్రసాద వినియోగం కార్యక్రమం జరుగుతుంది. అయ్యప్పస్వాములు, గురుస్వాములు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆలయ కమిటీ తెలిపారు.

ఎం.కొంగరవారిపల్లె గ్రామస్తులకు, రైల్వే అధికారులకు స్వల్ప వివాదం

● సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే నాని



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఎం.కొంగరవారిపల్లె గ్రామస్తులకు, రైల్వే అధికారులకు స్వల్ప వివాదం చోటు చేసుకొంది. దీంతో సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని హుటాహుటిన ఆగ్రామానికి వచ్చి సమస్యను పరిష్కరించారు. ఎం.కొంగరవారిపల్లె గ్రామం పక్కనే రైలు పట్టాలు ఉన్నాయి. అయితే సమీపంలో రైల్వే స్థలాన్ని గ్రామస్తులు ఆక్రమించుకొన్నారని, అదే గ్రామానికి చెందిన ఓమహిళ రైల్వే అధికారులకు ఫిర్యాదు చేయగా రైల్వే అధికారులు, పోలీసులు వచ్చారు. దీంతో గ్రామస్తులు, రైల్వే అధికారులు, పోలీసుల మధ్య వివాదం చెలరేగడంతో సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సి.గొల్లపల్లెలో యూరియా పంపిణీ



యూరియా పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి సుబ్బారావు తదితరులు

తిరుపతి రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లె రైతుసేవా కేంద్రంలో గురువారం రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ.. మొదటివిడతలో ఎకరానికి ఒకబస్తా చొప్పున పంపిణీ చేస్తున్నామని, మూడు విడతల్లో కలిపి మొత్తంగా మూడుబస్తాల యూరియాను రైతులకు అందిస్తామన్నారు. పంటకి అవసరమైన మోతాదులోనే యూరియాను వినియోగించాలని, అధికంగా వాడడం వల్ల చీడ, పీడలు ఎక్కువై దిగుబడి తగ్గుతుందని వివరించారు. దీంతోపాటు నేలస్వభావం కూడా మారుతుందన్నారు. ప్రైవేట్ దుకాణాల్లో నానోయూరియా, నానో డీఏపీ అందుబాటులో ఉందని, పైరునాటిన 20లేదా 30రోజుల తర్వాత ఎకరానికి అరలీటరు చొప్పున స్ప్రే చేసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. పంటలు సాగు చేస్తున్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు నకలు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్‌ఫోన్ నెంబర్లతో బయోమెట్రిక్ ద్వారా రైతుసేవాకేంద్రాల్లో యూరియాను పొందవచ్చని తెలిపారు. శుక్రవారం తనపల్లె, దుర్గసముద్రం రైతు సేవాకేంద్రాల్లో, శనివారం బ్రాహ్మణపట్టు కేంద్రంలో యూరియా పంపిణీ చేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నప్రసాదాల తయారీకి నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

● రైస్ మిల్లర్లతో టీటీడీ అదనపు ఈవో



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న వెంకయ్య చౌదరి

తిరుమల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నప్రసాదాల తయారీకి మరింత నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మిల్లర్లను కోరారు. తిరుమలలోని పద్మావతి గెస్ట్‌లో గురువారం ఆయన రైస్ మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ తెలంగాణ రైస్ మిల్లర్ల అసోసియేషన్ పర్యవేక్షణలో నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా టీటీడీకి బియ్యం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, దీంతో మరింత రుచికరమైన అన్నప్రసాదాలను భక్తులకు అందజేయవచ్చన్నారు. మిల్లర్లు బియ్యం సరఫరాపై నెలవారీ షెడ్యూల్ టీటీడీకి అందజేయాలన్నారు.తిరుమలతో పాటు తిరుచానూరు, ఇతర స్థానిక ఆలయాల్లో ప్రతి రోజు అన్నప్రసాదాల తయారీకి 20 వేల కేజీల బియ్యం వినియోగిస్తామన్నారు. టీటీడీకి 60:40 నిష్పత్తిలో ఏపీ, తెలంగాణ నుంచి రైస్ మిల్లర్లు సరఫరా చేసేలా నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ప్రతినెలా మిల్లర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించడంతోపాటు మూడు నెలలకోసారి నేరుగా సమావేశం నిర్వహిస్తామన్నారు.

బియ్యం శాంపిల్‌ను ఉడికించిన తర్వాతే వినియోగించండి

బియ్యం శాంపిల్‌ను తీసుకుని ఉడికించి, క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అన్నప్రసాద వినియోగానికి అనుమతించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రీవారిసేవకుల ద్వారా ఇకపై ప్రతినెలా అన్నప్రసాద నాణ్యతపై సర్వే నిర్వహించడంతోపాటు భక్తుల అభిప్రాయాల మేరకు బియ్యం నాణ్యత పెంచేలా చర్యలు ఉంటాయన్నారు. మిల్లర్లతో సమావేశం అనంతరం గుబ్బా కోల్డ్ స్టోరేజ్ ఇన్‌ఫ్రా సంస్థ ప్రతినిధులు టీటీడీలోని కోల్డ్ స్టోరేజ్ విభాగంలో ఆధ్వు కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాన్ని అభివృద్ధి చేసే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిపై అధ్యయనం చేయడంతో పాటు స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, సీఎఫ్టీఆర్ఐ సహకారంతో టీటీడీలో సరుకుల నిల్వపై మరింత మెరుగైన సౌకర్యాలు రూపకల్పనకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈవో రాజేంద్ర, వేర్‌హౌస్ డిప్యూటీఈవో పద్మావతి, ప్రొకూర్మెంట్ అధికారి ఉమాశంకర్, పోటు ఏఈవో మునిరత్నం, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో గజరాజుల బీభత్సం

●వరి, కొబ్బరి, మామిడి, వక్కచెట్లు, అనప పంట ధ్వంసం





ఏనుగుల మంద దాడిలో ధ్వంసమైన వరిపంట, వక్క చెట్లు, మామిడిచెట్టు కొమ్మలను విరిచేసిన ఏనుగులు

కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. రాత్రి వేళలో పొలాల్లోకి ప్రవేశిస్తున్న ఏనుగుల మంద బీభత్సం సృష్టిస్తున్నాయి. మండలంలోకమ్మపల్లి పంచాయతీలో బుధవారం రాత్రి వరి, కొబ్బరి, మామిడి, వక్క, అనప పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి బయలుదేరిన 16 ఏనుగుల మంద బాలిరెడ్డిగారి పల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు మోహన్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, తిమ్మారెడ్డికి చెందిన వరి, కొబ్బరి, మామిడిచెట్లను ఏనుగుల మంద ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి పొలాల వెంబడి దేశిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకుంది. రైతులు రవీంద్రారెడ్డి, కేశవులురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సిద్దారెడ్డి, చంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన వరి, కొబ్బరి, మామిడి, వక్కచెట్లను విరిచేశాయి. అనప పంటను తొక్కేశాయి. పొలానికి సమీపంలోని బండపై ఉన్న రైతు నారాయణరెడ్డికి చెందిన వరికుప్పను చెల్లాచెదురుచేశాయి. జాంద్రపేటలోని రైతు వెంకట్రామయ్యకు చెందిన మామిడి, అరటి, పశుగ్రాసం తినేసి అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. గురువారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద 16 ఏనుగులమంద సంచరించినట్లు అటవీ సిబ్బంది తెలిపారు.

వివాదాస్పద 'మఠం' భూమిలో మళ్లీ నిర్మాణాలు



తిరుపతిరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని వివాదాస్పద మఠం భూముల్లో మళ్లీ నిర్మాణాలు మొదలయ్యాయి. అవిలాల గ్రామలెక్కదాఖలా ధనలక్ష్మినగర్‌కు సమీపంలోని సర్వేనంబరు 17లో ని 2.20 ఎకరాల్లో మఠంభూమి ఉంది. గత ప్రభుత్వంలో వైసీపీకి చెందిన కొందరు స్థానికులు ఈ భూమి వందేళ్లకుపైగా(1887) తమ కుటుంబసభ్యుల అనుభవంలో ఉందని ఆస్థలంలోని ముళ్లచెట్లు, చెత్తాచెదారాలను తొలగించారు. చదును పనులు చేపట్టారు. లేఅవుట్ తరహాలో మట్టిరోడ్లు, ప్లాట్లు వేశారు. అంకణంధర రూ.40వేల నుంచి 60వేలవరకూ విక్రయించారని అప్పట్లో మీడియాలో వార్తలు రావడంతో మఠం అధికారులు అడ్డుకున్నారు. దీంతో ప్లాట్లని కొన్నవారు నిర్మాణాలు చేపట్టకుండా ఉండిపోయారు. ఇప్పుడు.. వీరిలో ఒకరు ఆ స్థలంలో బోరువేసి నిర్మాణ పనులకు పునాది గుంతలు తవ్వారు. నిర్మాణ సామగ్రిని అందుబాటులో ఉంచుకుని పనులను చేపడుతున్నారు. తాను మూడేళ్ల ముందు 45అంకణాల ప్లాట్‌ని కొన్నానని ఆయన చెబుతున్నారు. కాగా, గతంలో ఇదేగ్రామంలోని మఠం స్థలంలో కొందరు చేపట్టిన తాత్కాలిక రేకుల ఇళ్లను అప్పటి పరిపాలనాధికారి రమేష్‌నాయుడు నేతృత్వంలో తొలగించారు. గ్రామంలోని 13, 15, 17/2, 17/3, 17/5లలో 174.75ఎకరాల భూమి హథీరాంమఠానికి చెందినదని, ఇందులో కొంతభాగం వారసత్వంగా తమకు సంబంధించినదంటూ స్టాంప్‌పేపర్లపై విక్రయాలు చేస్తున్నారని అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక, అవిలాల పంచాయతీలోని మఠం భూములకి సంబంధించి సర్వహక్కులు హథీరాంజీ మఠానికే చెందుతాయని హైకోర్టు 2018లో ఉత్తర్వులిచ్చిందని పేర్కొన్నారు. కాగా వివాదాస్పద మఠంభూమిలో నిర్మాణాన్ని చేపడుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తిచూడకపోవడంపై స్థానికులు పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇదేస్థలంపై న్యాయస్థానంలోనూ కేసు నడుస్తుందని స్థానికులు అంటున్నారు.

పెద్దిరెడ్డి అక్రమాలను

బయటపెట్టిన పవన్

● జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్



తిరుపతి అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలను బయటపెట్టిన దమ్మున్న నాయకుడు పవన్‌కల్యాణ్ అని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. గురువారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎర్రచందనం, అటవీ భూముల కొనుగోలు చేస్తున్నట్లు నిరూపించాలని, లేదంటే క్షమాపణలు చెప్పాలని ఎంపీ మిథున్‌రెడ్డి డిమాండ్ చేస్తుండడం హాస్యాస్పందంగా ఉందన్నారు. మంగళం పేటలో 76ఎకరాలు కొనుగోలు చేశారని, అది ప్రస్తుతం 103.9ఎకరాలు ఎలా అయ్యిందో చెప్పాలని అన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా గురించి జిల్లాలో ఎవరిని అడిగినా పెద్దిరెడ్డి కుటుంబం వైపే చూపిస్తారన్నారు. వీటన్నింటిపైనా త్వరలోనే పవన్‌కల్యాణ్ లెక్క తేలుస్తారని అన్నారు. ఈ వ్యవహారంలో నలుగురిపై కేసులు నమోదయ్యాయని, త్వరలోనే ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుందని తెలిపారు. పనీపాట లేకుండా మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నోరుపారేసుకోవడం సరికాదని హితవుపలికారు. ఈ సమావేశంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, సుభాషిణి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురువారాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వ హించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ, వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు నిర్వ హించారు. అనంతరం స్వామివారిని పాలు, పె రుగు, పంచామృతం, చం దనం, నారికేళ జలాలతో అభిషేకించారు. సుగంధభరిత పూలు, స్వర్ణాభరణాలతో అలంకరించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. పర్వత, చక్ర, కుంభ, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

కళత్తూరు వాసులకు శాశ్వత పరిష్కారం చూపండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం నేతలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కళత్తూరు దళితవాడ ముంపు ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని అఖిలపక్ష నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఓళ్లూరు రాయలచెరువు కట్ట తెగి ముంపునకు గురైన కళత్తూరు దళితవాడ ప్రజలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. ఆస్తి నష్టానికి పరిహారం ఇప్పించాలన్నారు. ధృవీకరణ పత్రాలు కోల్పోయిన వారికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, తిరుపతి రూరల్ మండల ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి, అమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగేష్ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బెల్ట్‌షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ అత్తరాల నారాయణ పేరుతో మంజూరైన మద్యం దుకాణాన్ని పుత్తూరులో గౌడ సంఘాలు కలిసి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారుల సూచనల మేరకు కల్యాణపురం వద్దకు దుకాణం మార్చామని, అయితే బెల్ట్ దుకాణ నిర్వాహకులు పగలు రాత్రి తేడా లేకుండా అమ్మకాలు సాగిస్తుండటంతో తమ వ్యాపారం దెబ్బతింటోందన్నారు. బెల్ట్‌షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగరాజుగౌడ్, అత్తిరాల శ్రీరాములు గౌడ్, సత్యనారాయణ గౌడ్, రాంబాబు గౌడ్, పురుషోత్తం గౌడ్, రామయ్య గౌడ్, మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ


కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న సొసైటీ నిర్వాహకులు

తిరుపతి అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏకం యూఎస్ఏ వారి ఆర్థిక సాయంతో గురువారం 30 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. కుట్టు వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకుని కృషితో పనిచేస్తే గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్‌బాబు, సిర్డ్ కార్యదర్శి మరుపూరి హేమశేఖర్, హరికృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, మోహన్, జ్ఞానశేఖర్‌రెడ్డి, తేజోవతి, శ్వేత, సుప్రియ, లోకిత, నాగరత్న పాల్గొన్నారు.

లడ్డూ కల్తీ కేసులో నా వద్ద కీలక ఆధారాలున్నాయి

● జనసేన నేత కిరణ్‌రాయల్


మీడియా సమావేశంలో కిరణ్‌రాయల్ తదితరులు

తిరుపతి (ఎమ్మార్ పల్లె), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ కల్తీ కేసులో తన వద్ద కీలక ఆధారాలున్నాయని, త్వరలో సిట్ అధికారులను కలిసి వాటిని అందిస్తానని జనసేన నేత కిరణ్‌రాయల్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన లడ్డూ కల్తీపై జేఈవో కార్యాలయంలో పనిచేసే అధికారులను విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. సిట్ అధికారులు తన ఇంటికే వచ్చి విచారించాలని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కోరడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం మారినా టీటీడీలో ఇంకా కొంతమంది ధర్మారెడ్డి మనుషులు ఉన్నారని, వారిపై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకేపాటి సుభాషిణి, హేమంత్‌కుమార్, దుర్గ, మనోజ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి టీడీపీలో సముచిత స్థానం

● తోట వాసుకు డిప్యూటీ మేయర్ సన్మానం



తిరుపతి(జీవకోన), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం లభిస్తుందని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తోటా వాసు గురువారం మునికృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వాసును సన్మానించారు. తోట వెంకటేశ్వర్లు కుటుంబానికి టీడీపీ సముచిత స్థానం కల్పించిందన్నారు. పార్టీ కోసం మరింత కష్టపడి పనిచేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని మునికృష్ణ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున, భరత్, హర్ష, రాజేష్ పాల్గొన్నారు.

వినాయక సాగర్, గ్లో గార్డెన్‌కు టెండర్లు

తిరుపతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : కరకంబాడీ రోడ్డులోని బొంతాలమ్మ గుడి వద్ద ఉన్న వినాయక సాగర్ పార్కు, గ్లో గార్డెన్ ప్రవేశరుసుం వసూలుకు వేలంలో రూ.3.10 లక్షలు పలికిందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. వినాయకసాగర్, గ్లో గార్డెన్ లోనికి ప్రవేశం, సాగర్ పార్కులోని గేమ్ జోన్ నిర్వహణకు, పార్కుకు, స్విమ్మింగ్ పూల్‌కు, బొంతాలమ్మ గుడి పక్కన నిర్మించిన షాపులకు వచ్చే సందర్శకుల నుంచి పార్కింగ్, పార్కులోని స్విమ్మింగ్ పూల్ నిర్వహణ కోసం మూడేళ్ల లీజు పద్ధతిపై ఇచ్చేందుకు సీల్డ్‌టెండరు, బహిరంగ వేలాన్ని కమిషనర్ సమక్షంలో గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. గేమ్ జోన్ నిర్వహణకు ఎవ్వరూ ఆసక్తి చూపలేదు. స్విమ్మింగ్ పూల్ నిర్వహణకు సంబంధించి బహిరంగ వేలానికి ఒక్క టెండరు మాత్రమే వచ్చింది. సదరు టెండరును నిబంధనల మేరకు వాయిదా వేసినట్టు తెలిపారు. వినాయకసాగర్ పార్కు, గ్లో గార్డెన్ ప్రవేశరుసుం వసూలుకు శరవణ కుమార్ రూ3.10లక్షల హెచ్చు పాటదారుడిగా నిలిచారు. స్విమ్మింగ్ పూల్, షాపింగ్ కాంప్లెక్స్‌కు వచ్చే సందర్శకుల నుంచి పార్కింగు ఫీజు వసూలు చేసుకునే టెండరును రూ.1.35 లక్షలతో కృష్ణారెడ్డికి కేటాయించారు. వేలం పాటలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ ఎస్కే బాబు, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఆర్వోలు సేతుమాధవ్, రవి తదితరులు పాల్గొన్నారు.


వేలం పాటలో కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

● షాపులకొచ్చేవారి నుంచి పార్కింగ్ ఫీజా?

తిరుపతి నగరపాలక సంస్థ గురువారం నిర్వహించిన వినాయకసాగర్ పార్కింగ్ టెండర్లు ఆశ్చర్యానికి గురిచేశాయి. సాగర్ సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు వచ్చే సందర్శకుల నుంచి కూడా పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునే హక్కు కాంట్రాక్టర్‌కు కల్పించడంతో విస్తుపోతున్నారు. షాపింగ్ కోసం వచ్చేవారి నుంచి వసూలు చేయడం సరికాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అన్ని దేవాలయాల్లో ఎస్సీలకు ప్రవేశం కల్పించాలి

తిరుపతిరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న అన్ని దేవాలయాల్లో ఎస్సీలకు ప్రవేశం కల్పించాలని రేణుకాపురం శాంతి ఆశ్రమ పీఠాధిపతి వేదాంత అనుభవానంద పేర్కొన్నారు. జాతీయ దేవాలయ ప్రవేశ ఉత్సవాన్ని పురస్కరించుకుని సామాజిక సమరసత, ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఎమ్మార్‌పల్లెలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. 1936 నవంబరు 12న తిరువాన్కూర్ మహారాజు అన్ని వర్గాలకు దేవాలయ ప్రవేశాన్ని కల్పిస్తూ ప్రకటన చేశారని, దీన్ని పురస్కరించుకుని ఏటా దేవాలయ ప్రవేశ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షుడు సూర్యకిరణ్, కార్యదర్శి చీనేపల్లి కిరణ్‌కుమార్, లీలాకృష్ణ, కట్టమంచి చంద్రబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వేదాంత అనుభవానంద, పక్కన సూర్యకిరణ్



క్రీడా పోటీల్లో తిరుచానూరు విద్యార్థిని ప్రతిభ

తిరుచానూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన అంతర్ జిల్లాల క్రీడా పోటీల్లో తిరుచానూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థిని చాందిని టెన్నిస్ పోటీల్లో తృతీయ బహుమతి కైవసం చేసుకుంది. త్వరలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా గురువారం చాందినిని పాఠశాల హెచ్ఎం మురళి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడా పోటీల్లో జిల్లా అధికారుల ప్రతిభ


అధికారులను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన రెవెన్యూ ఉద్యోగులు సురేంద్ర, జయరాజ్(డీటీలు) క్యారమ్స్ విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. మ్యూజికల్ చైర్స్ విభాగంలో టైపిస్టు మాధవి ద్వితీయ స్థానం సాధించారు. వారిని గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ నేతలు శివప్రసాద్, గోపీనాథ్‌రెడ్డి, రూప్‌చంద్, దిలీప్ పాల్గొన్నారు.



తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌ను ట్రైనీ కలెక్టర్ రఘువన్షీ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి గురువారం రాత్రి సందర్శించారు. పిల్లలతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. దుప్పట్లు పంపిణీ చేశారు. వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

– తిరుపతి (కలెక్టరేట్)

వైద్య కళాశాలలపై వైసీపీ తప్పుడు ప్రచారం


మీడియాతో మాట్లాడుతున్న శ్రీధర్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 13(ఆంధ్ర జ్యోతి): వైద్య కళాశాలలపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ డాక్టర్ కొడిగంటి శ్రీధర్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన పీపీపీ విధానంలో కొత్త వైద్య కళాశాలలను చేర్చిందని, దాని గురించి అవగాహన లేని వైసీపీ నేతలు ప్రైవేటీకరణ పేరుతో ప్రజల్లో భయాన్ని కలిగిస్తున్నారని విమర్శించారు. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదని, ప్రైవేటు, ప్రజా భాగస్వామ్యంలో అభివృద్ధి చేయడమేనని అన్నారు. ఆస్పత్రుల భూమి యాజమాన్య నియంత్రణ ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందన్నారు. కొన్ని సంవత్సరాల తర్వాత ప్రభుత్వానికి తిరిగి వస్తాయని వివరించారు. అలాగే ఆస్పత్రిలో 70 శాతం పడకలు పూర్తిగా ఉచితమని, 30 శాతానికి మాత్రమే ఛార్జీలు వర్తిస్తాయని అన్నారు. 50శాతం సీట్లు ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని, వారి మాటలను ఎవరూ నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, దామురాయల్, అనిల్‌కుమార్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


మదనపల్లె పర్యటనకు వచ్చిన పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను గురువారం ఉదయం ఆ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు రాజారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువకప్పి సన్మానించారు. తిరుపతిలో పార్టీ పరిస్థితిపై నాదెండ్ల ఆరా తీశారు.



నేడు ప్రపంచ మధుమేహ దినం

అంతా మీ చేతిలోనే ఉంది

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం ● జాగ్రత్తలే శ్రీరామరక్ష

మధుమేహం అంటే..

మన రక్తంలో గ్లూకోజ్(చక్కెర) స్థాయి ఎక్కువగా ఉండే స్థితిని మధుమేహం (డయాబెటిక్) అంటారు. ఇన్సులిన్ అనే హార్మోన్ తగినంతగా శరీరంలో ఉత్పత్తి కాకపోవడం, కణాలు దానికి సరిగ్గా స్పందించక పోవడం వలన గ్లూకోజ్ స్థాయి పెరిగి మధుమేహంగా మారుతుంది.

తిరుపతి(వైద్యం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మధుమేహం(డయాబెటిక్) జీవితకాల సమస్యే కానీ, తగిన జాగ్రత్తలో నియంత్రించుకుంటే ఆరోగ్యానికి ముప్పు ఉండదు. తీసుకునే ఆహారం, శారీరక వ్యాయామం ఇవి రెండూ నియంత్రణలో కీలకం. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల ఫలితంగా ప్రజల్లో మధుమేహం పెరుగుతోంది. మధుమేహం వ్యాప్తిస్తున్న దేశాల్లో మన దేశం మొదటి స్థానంలో ఉంటే, దేశంలో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో మన జిల్లా నాలుగో స్థానంలో ఉంది. తిరుపతి జిల్లాలో 1,22,245 మంది మధుమేహంతో బాధపడుతున్నారని లెక్కలు చెబుతున్నాయి. ఇది టెస్ట్ చేసుకుని మధుమేహం నిర్ధారణ అయినవారి సంఖ్య. టెస్ట్ చేయించుకోనివారిలో ఈ వ్యాధి ఎంతమందికి ఉందో అంచనా కట్టలేం.

లక్షణాలు:

ఎక్కువగా మూత్ర విసర్జన, అధికంగా దాహం, ఆకలి వేయడంతో పాటు బరువు తగ్గడం, దృష్టిలోపం, అలసట, గాయాలు మానకపోవడం, చర్మం దురదగా అనిపించడం.

రెండు రకాలు :

ఒకటి గర్భంతో ఉన్న వారికి, పుట్టిన పిల్లలకు వస్తుంది. వీరు వైద్యుల సలహాలు పాటించి ఆహారం విషయంలో సరైన జాగ్రత్తలు పాటించడం వలన కాన్పు తరువాత, బిడ్డ పుట్టిన నెల తరువాత వీరు సాధారణ పరిస్థితికి వస్తారు.

రెండో దశలో వచ్చే మధుమేహం జీవితకాలం మనతోనే ఉంటుంది. దీనిని కేవలం మందులు, సరైన ఆహారం, వ్యాయామాలతో అదుపులో ఉంచుకోవచ్చు.

జాగ్రత్తలు పాటించకపోతే..

మధుమేహంతో బాధపడే వారు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే, వైద్యుల సూచనలు పాటించకపోతే నియంత్రణ సాధ్యంకాదు. దీని ప్రభావం శరీరంలోని పలు అవయవాలపై పడి వాటిని దెబ్బతీయడంతోపాటు చివరకు ప్రాణాలే బలిఅవుతాయి. ప్రధానంగా గుండెపోటు, పక్షవాతం, నరాలు దెబ్బతినడం(డయాబెటిక్ న్యూరోపతి), కిడ్నీ సమస్యలు, దృష్టిలోపం(డయాబెటిక్ రెటినోపతి) వంటి ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. పాదాల, చర్మ, దంతాల, జీర్ణ, లైంగిక, మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

పూర్తిగా నయం చేస్తామనేవారి మాటలు నమ్మొద్దు



ప్రస్తుత జీవన విధానంలో వయస్సుతో సంబంధం లేకుండా మధుమేహం బారిన పడుతున్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి మధుమేహ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం సురక్షితం. అలాగే మధుమేహ బాధితులు 3-4 నెలలకు ఒకసారి అవసరమైతే రెండు వారాలకు ఒకసారి ఈ పరీక్షలు చేసుకుంటూ తగు జాగ్రత్తలు పాటించాలి. మధుమేహాన్ని పూర్తిగా తగ్గిస్తామనే వారి మాటలు నమ్మి నాటు మందులు, ఇతర కషాయాలు వాడి ప్రాణాల మీదకు తెచ్చుకోకండి.

- డాక్టర్ అలోక్ సచిన్,
ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, స్విమ్స్

సొంత నిర్ణయాలు వద్దు



మధుమేహంతో తీవ్రంగా ఇబ్బంది పడే వారు అన్ని విభాగాల డాక్టర్లు అందుబాటులో ఉండే ఆస్పత్రుల్లో మాత్రమే చూపించుకోవడం సురక్షితం. మధుమేహ బాధితులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఖరీదైన మందులు, ఇన్సులిన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిని కూడా డాక్టర్లు చెప్పిన విధంగానే వాడాలి. ప్రధానంగా మధుమేహ బాధితులు ఆహారం, వైద్యం వంటి విషయాల్లో సొంత నిర్ణయాలు తీసుకోకూడదు.

- డాక్టర్ తులసీరాం, ప్రొఫెసర్
ఆఫ్ జనరల్ మెడిసిన్, రుయాస్పత్రి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. నడక వల్ల ప్రయోజనం ఉంటుంది.
- ఒత్తిడిని తగ్గించుకోవాలి.
- చక్కెరతో చేసిన పదార్థాలు, స్వీట్లు, సిరప్‌లు వంటి వాటి జోలికి పోరాదు.
- ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి.
- క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి.



వేములపాటి అజయ్ - వెంకటేష్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్, అల్లు అర్జున్ సోదరుడు అల్లు వెంకటేష్ దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

శ్రీహరి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 21 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.54 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 72,283

తలనీలాలు సమర్పించినవారు: 22,583



‘పద్మావతి’లో ‘నృత్య వాహిని’





తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ‘నృత్య వాహిని’ మొదలైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని గురువారం వీసీ ఉమ ప్రారంభించారు. కళల ద్వారా మనుషుల్లో సమైక్యతా భావన పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. దేశ, విదేశీ ప్రతినిధులతో నృత్యోత్సవం నిర్వహించడం ద్వారా యూనివర్సిటీ విద్యార్థినుల్లో ఉత్తేజం కలుగుతుందన్నారు. మనకు వారసత్వంగా సంక్రమించిన నృత్యాలను పరిరక్షించుకోవాలని, దీనికి యూనివర్సిటీలో సంగీత, నృత్య విభాగం ఎంతో కృషి చేస్తుందన్నారు. నృత్యాలను కాపాడుకోవడం అంటే మన సంస్కృతిని కాపాడుకోవడం అవుతుందని మైసూరు వర్సిటీ ప్రొఫెసర్ శ్రీధర్ అన్నారు. ఆయా ప్రాంతాల ప్రతినిధులు వివిధ నృత్య రీతులతో అలరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, హ్యూమనిటీస్ డీన్ వాణి, అంతర్జాతీయ డీన్ విజయలక్ష్మి, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కార్యదర్శి హిమబిందు, దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.



నృత్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ ఉమ

◆ ఢిల్లీ పేలుడు ఎఫెక్ట్

తిరుపతి దిగ్బంధం

● నగరం చుట్టూ ఏడు చెక్ పోస్టులు



తిరుపతి రూరల్‌లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పేలుళ్ల ఘటనతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. తిరుమల ప్రాశస్త్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎస్పీ సుబ్బరాయుడు పటిష్ఠ చర్యలు చేపట్టారు. తిరుపతి చుట్టూ.. చెర్లోపల్లె, పచ్చికాపల్లం, వేదాంతపురం, నారాయణాద్రి ఆస్పత్రి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, చిగురువాడ, తనపల్లి, తిరుచానూరు పరిధిలోని పూడి రోడ్డు, ఆటోనగర్‌లోని లాజిజ్ రెస్టారెంటు ప్రాంతాల్లో ఈ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి చెక్ పోస్టు వద్ద ఒక ఎస్‌ఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉంటారు. రెండు షిఫ్టుల్లో పని చేసేలా సిబ్బందిని నియమించారు. వీరితో పాటు ఇద్దరు సాయుధ బలగాలు వుంటారు. చెక్‌పోస్టు వద్దకు వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి పంపాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పేలుడు, నిషేధిత వస్తువులు తిరుపతిలోకి రాకుండా పటిష్ఠ తనిఖీలు చేయాలని డీఎస్పీ భక్తవత్సలం ఆదేశించారు. ఇక బస్టాండు, రైల్వే స్టేషన్లలో డాగ్, బాంబు స్క్వాడ్‌లు తనిఖీలు చేస్తున్నాయి. అనుమానం వున్న ప్రతి ఒక్కరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇక, రేణిగుంట విమానాశ్రయంలో బాంబు స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు.

భార్యపై కోపంతో అత్తింటికి నిప్పు

కోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఓ వ్యక్తి అత్త వారింటికి పెట్రోలు పోసి నిప్పు పెట్టిన వైనమిది. అదృష్టవశాత్తూ ప్రాణ నష్టం జరగలేదు. పోలీసుల కథనం ప్రకారం వివరాలివి. చిల్లకూరు మండలం వల్లివేడుకు చెందిన ఏడుకొండలికి కోట మండలం కొత్తపాలేనికి చెందిన శిరీషతో ఐదేళ్ల క్రితం పెళ్లయింది. రెండేళ్ల నుంచి అనుమానంతో భార్యను వేధిస్తున్నాడు. దీంతో ఆమె కొద్దిరోజుల క్రితం పుట్టింటికి వచ్చేసింది. గురువారం ఏడుకొండలు అత్తవారింటికి వచ్చాడు. భార్యతో గొడవ పడి కొట్టాడు. ఆమె కోపంతో మరో గదిలోకి వెళ్లిపోయింది. ఈలోగా ఏడుకొండలు వెంట తెచ్చుకున్న పెట్రోలు తీసి గదిలో పోసి నిప్పంటించాడు. ఇంట్లో వారు గుర్తించి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అయితే గదిలో అప్పటికే రూ.4లక్షల విలువైన ఫర్నిచర్ దగ్ధమైంది.

రాయలచెరువు ముంపు బాధితులకు రూ.14.5 లక్షల సాయం

● బైర్గన్ పరిశ్రమ ఉదారత



వరదసాయంతో పాటు వివిధవస్తువులు కలెక్టర్‌కు అందజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం ఓళూరు రాయలచెరువు కట్ట తెగిన ఘటనలో ముంపుబారిన పడిన కళత్తూరు హరిజనవాడ, మరో రెండు గ్రామాల బాధితులకు రూ.14.5 లక్షల సాయం అందింది. శ్రీసిటీలోని బైర్గన్ పైప్ సపోర్టు పరిశ్రమ నిర్వాహకులు రూ.10లక్షల సాయంతో పాటు రూ.4.5 లక్షల విలువైన 1,200 ఎల్ఈడీ బల్బులు, 750 దుప్పట్లు, 75 టేబుల్‌ఫ్యాన్లు అందజేశారు. వీటిని ఆ పరిశ్రమ ప్రతినిధి అల్తాఫ్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందించారు. ఆ పరిశ్రమ ఉదారతను కొనియాడుతూ.. మరికొంతమంది సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

‘అరణియార్’లోకి ఆరు లక్షల చేప పిల్లలు



రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టులోకి నీళ్లు చేరడంతో గురువారం ఆరు లక్షల చేపల పిల్లలను వదిలారు. మరో ఐదు రోజుల్లో ఇంకో నాలుగు లక్షల చేప పిల్లలు వదలనున్నారు. ఈ రిజర్వాయరులోని చేపలకు అటు చెన్నై, ఇటు నెల్లూరు, తిరుపతిలో మంచి గిరాకీ ఉందని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. ఈ చేపలకు మార్కెట్ కల్పిస్తే మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, డీఎఫ్‌వో శాంతి, ఎఫ్‌డీవో మధుసూదన్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు, ఎంపీడీవో మహ్మద్‌రఫి, అరణియార్ ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, నాయకులు వాసురెడ్డి, ఎస్.ఎం.సురేష్, సుమాంజలి, మునిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ చోరీ కేసులో క్లీనర్ అరెస్టు



దొంగ అరెస్టును చూపుతున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తాను క్లీనర్‌గా పనిచేస్తున్న లారీని డ్రైవర్ లేని సమయంలో చోరీకి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి గురువారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. పలమనేరుకు చెందిన మధుసూదన్‌నాయుడు లారీ యజమానిగా వస్తు రవాణా సాగిస్తుంటాడు. శ్రీకాళహస్తి పట్టణం కొత్తపేటకు చెందిన కన్నయ్యనాయుడు ఆ లారీకి డ్రైవర్‌గా, ఇదే పట్టణం బహదూరుపేటకు చెందిన జయచంద్ర(45) క్లీనర్‌గా పని చేస్తుండేవాడు. వారం రోజుల క్రితం నెల్లూరు నుంచి ఖాళీ లారీతో పలమనేరుకు వెళుతూ శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని బసవయ్యపాళెం వద్ద విశ్రాంతి కోసం ఆగారు. ఈ సమయంలో డ్రైవర్ కన్నయ్యనాయుడు ఇంటికి వెళ్లడంతో క్లీనర్ జయచంద్ర లారీని చోరీ చేశాడు. యజమాని మధుసూదన్‌నాయుడు ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 2వ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తొట్టంబేడు మండలం కన్నలి ఎస్టీకాలనీ వద్ద గురువారం లారీ సహా క్లీనర్ జయచంద్రను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెల్లడించారు.

నేటి నుంచి ఐసర్‌లో భారత శాస్త్ర అకాడమీ సదస్సు

● 150 మంది శాస్త్రవేత్తల రాక

ఏర్పేడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని ఐసర్‌లో బెంగళూరుకు చెందిన భారత శాస్త్ర అకాడమీ ఆధ్వర్యంలో 91వ వార్షిక సదస్సు శుక్రవారం నుంచి 16వ తేదీ వరకు జరగనుంది. మూడు రోజుల పాటు తిరుపతి ఐసర్‌లో జరగనుంది. సర్ సీవీ రామన్ 1934లో స్థాపించిన ఈ అకాడమీ.. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి కృషి చేస్తోంది. ఈ అకాడమీ శాస్త్రీయ ఆలోచన, జ్ఞాన మార్పిడి, విజ్ఞాన విద్య, పరిశోధనలను దేశవ్యాప్తంగా అభివృద్ధి పరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ క్రమంలో జరిగే 91వ వార్షిక సదస్సులో దేశంలోని 150మంది ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొని.. పరిశోధనలను పరిచయం చేస్తారు. అకాడమీ ఫెలోషిప్ అసోసియేట్లు, పరిశోధకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆహ్వానితులు శాస్త్రీయ చర్చలు, ఆలోచనల మార్పిడి జరుపుతారు. ఐఐఎస్‌సీ బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ ‘వైరల్ వ్యాక్సిన్ల స్థిరత్వం, ప్రభావాన్ని పెంపొదించడం’ అంశంపై అధ్యక్ష ప్రసంగం చేస్తారు. పబ్లిక్ లెక్చర్‌గా ‘ఏఐ ఫర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్’పై ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ కల్యాణ రామన్ మాట్లాడనున్నారు. ప్రత్యేక సింపోజియాలు, లెక్చర్లతో పాటు లీలావతీస్ డాటర్స్ పుస్తకాన్ని కన్నడ, ఒరియా భాషల్లో ఆవిష్కరిస్తారు. విద్యార్థుల కోసం విజ్ఞాన కథలు పేరుతో మధ్య పాఠశాల విద్యార్థుల కోసం విజ్ఞాన అవగాహన కార్యక్రమం 14, 15 తేదీల్లో అవుట్‌రీచ్ కార్యక్రమం ఉంటుంది. అకాడమీ అధికార యూట్యూబ్ ఛానల్ ద్వారా ఈ కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

సదస్సులో నేడు: శుక్రవారం ఉదయ 8.45గంటలకు రిజిస్ట్రేషన్, 9.10 నుంచి 10.30 వరకు బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ అధ్యక్ష ప్రసంగం, 11.45గంటలకు ప్రజా ఉపన్యాసం, 12.30గంటలకు గ్రూప్ ఫొటో, 2 గంటలకు ఫెలోస్ ఉపన్యాసాలు, 3.20గంటలకు టీ విరామం, 4గంటలకు ఫరీదాబాద్ టీహెచ్‌ఎస్‌టీఐ ప్రొఫెసర్ డాక్టర్ శింజని భట్నాగర్ ఉపన్యాసం, 4.40గంటలకు ప్రత్యేక సమావేశం, 6.10 గంటలకు ఫెలోస్ ఉపన్యాసాలు,



నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

● డిస్కం సీఎండీ శివశంకర్



తిరుపతి(ఆటోనగర్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని 9 జిల్లాల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేసే లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో అధికారులు పనిచేయాలని ఆ సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ ఆదేశించారు. తిరుపతిలోని విద్యుత్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ ఈఈలు, ఈఈలు, ఎస్ఈలు, జీఎం, సీజీఎం స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వినియోగదారులకు అధికారులు అందుబాటులో ఉండి సత్వర సేవలందించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు రాకుండా లోడ్ నియంత్రణపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి వస్తున్న ఫిర్యాదుల సంఖ్యను తగ్గించాలని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు త్వరితగతిన వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. 11కేవీ ఫీడర్లకు, డీటీఆర్‌లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. నెలవారీగా విద్యుత్ బిల్లులు 100 శాతం వసూలు చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహనరావు, సీజీఎంలు జె.రమణాదేవి, ఎన్.శోభావాలింటీనా, ఎం.మురళీకుమార్, ఎం.ఉమాపతి, ఆదిశేషయ్య, జానకిరామ్, సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

◆ నా మాటకు విలువలేనప్పుడు

ఎందుకీ ఇన్‌చార్జి పదవి?

● గంగమ్మ గుడిలో మెంబరునూ వేసుకోలేకపోయా

● టీడీపీ ముఖ్యనేతల ఎదుట సుగుణమ్మ ఆవేదన

తిరుపతి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ‘తాతయ్య గుంట గంగమ్మ గుడిలో ఒక మెంబరునూ వేసుకోలేకపోయా. నాకు సమాచారం లేకుండానే కార్యక్రమాలు చేస్తున్నారు. నా మాటకు విలువ లేనప్పుడు నాకెందుకీ ఇన్‌చార్జి పదవి’? అంటూ ఏపీ జీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, నాలెడ్జ్ కమిటీ చైర్మన్ మాల్యాద్రి, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాళెం విజయకుమార్ సమక్షంలో గురువారం తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన క్లస్టర్ ఇంచార్జిలు, కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ‘2019 ఎన్నికల్లో నేను గెలిచానో, ఓడిపోయానో అందరికీ తెలుసు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నిక వైసీపీ అధికారబలంతో రాష్ట్ర వ్యాప్తంగా చేజిక్కించుకుంది. అయితే తిరుపతి నియోజకవర్గాన్నే భూతద్దంలో చూపించారు. అయినా ప్రతిపక్షహోదాలో తిరుపతిలోని కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చాను. 2024లో టికెట్ వస్తుందని ఆశించా. కూటమి పొత్తులో భాగంగా మిత్రపక్షమైన జనసేనకు సీటు పోయింది. ఆ సమయంలో కాస్త అసంతృప్తి చెందిన మాట వాస్తవమే. అవన్నీ పక్కన పెట్టి అందరినీ కలుపుకుని పోయి అత్యధిక మెజారిటీతో కూటమి అభ్యర్థిని గెలిపించుకున్నాం. ఈక్రమంలో వచ్చిన నామినేటెడ్ పోస్టులు కొంత అసంతృప్తి కలిగించాయి. గంగమ్మ గుడిలో మెంబరుగా కూడా నేను సూచించిన వ్యక్తికి రాకపోవడం బాధకలిగింది’ అని సుగుణమ్మ వాపోయారు. వైసీపీ నాయకుల పట్ల కొందరు పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూస్తే అధికారంలో ఎవరున్నారన్న అనుమానం కలుగుతోందని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. తిరుపతిలో జనసేన ఎమ్మెల్యే కావడంతో టీడీపీ శ్రేణులకు దిక్కులేకుండా పోయిందని సూరా సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. యాదవులంటే ఒకే కుటుంబమేనా? వారికే పదవులా? తిరుపతి టీడీపీలో ఇంకెవరూ లేరా అంటూ బీజీ కృష్ణ యాదవ్ ప్రశ్నించారు.

గ్రూపులు వదిలేయండి.

సుగుణమ్మ, ఆమె అల్లుడు సంజయ్ 2019 ఎన్నిక సరిగ్గా చేసుంటే ఇప్పుడు ఆమె మంత్రి అయ్యేవారని మాల్యాద్రి చెప్పారు. వర్ల రామయ్య మాట్లాడుతూ 2009లో ఎంపీగా పోటీ చేసినప్పుడు 45 నిమిషాలు ముందు చెబితే తాను నామినేషన్ వేశానని గుర్తుచేసుకున్నారు. కొందరి వల్ల ఓడిపోవాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు. గ్రూపులు వదిలేసి అందరినీ కలుపుకుని పోవాలని అటు సుగుణమ్మకు, ఇటు పార్టీ శ్రేణులకు వారు పిలుపునిచ్చారు. తిరుపతి ఇన్‌చార్జి సుగుణమ్మ ఆదేశాల ప్రకారం నాయకులు, కార్యకర్తలు నడుచుకోవాలని సూచించారు.



సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న వర్ల రామయ్య, టీడీపీ నేతలు

‘గ్రేటర్’లో విలీనానికి కరకంబాడి ఓకే

రేణిగుంట/తిరుపతి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనానికి కరకంబాడి పంచాయతీ బోర్డు ఆమోదించింది. కలెక్టర్ ఆదేశాలు మేరకు రేణిగుంట మండలం పరిధిలోని కరకంబాడి, రేణిగుంట, గాజులమండ్యం పంచాయతీల సర్పంచుల అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో పంచాయతీ బోర్డు సమావేశం జరిగింది. ఇందులో కరకంబాడి పంచాయతీ పాలకమండలి కార్పొరేషన్‌లో విలీనానికి ఆమోదించారు. కోరం లేనందున రేణిగుంట పాలకమండలి సమావేశం వాయిదా పడింది.

మేము కలవలేం : తిరుపతిరూరల్‌మండలం రామానుజపల్లె పంచాయతీకార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో గ్రామసర్పంచ్, వార్డుసభ్యులు కలసి గ్రేటర్‌తిరుపతిలో విలీనానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. గ్రామపంచాయతీగానే ఉంచాలని కోరారు.గ్రేటర్‌లో విలీనం చేయడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై పన్నులభారం పెరుగుతుందని, పలు సమస్యల కోసం కార్పొరేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ఈ మేరకు తీర్మాన పత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. సర్పంచ్ లీలారాణి, వైస్‌సర్పంచ్, వార్డుసభ్యులు, కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ పాలకమండలి కూడా కార్పొరేషన్‌లో విలీనాన్ని తిరస్కరించింది.

సూళ్లూరుపేట/వెంకటగిరి

శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న మద్దాలి శ్రీనివాసులు, వెంకట నాగరాజు

సూళ్లూరుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణ వీధిలో రామాలయం శివాలయ ని ర్మాణం కోసం గురువారం పట్టణానికి చెందిన మ ద్దాలి శ్రీనివాసులు, వె ంకట నాగరా జులు రూ.లక్ష విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కారం శెట్టి మల్లికార్జున రావు. ఎస్.శివ కుమార్ పాల్గొన్నారు.

నాయుడుపేటలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు


నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నాయుడుపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో గురువారం డాగ్ స్క్వాతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాలను గుర్తించడంలో ప్రత్యేక శిక్షణ పొందిన గిరి అనే డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అనుమానస్పదంగా కన్పించిన వ్యక్తుల వివరాలను సేకరించారు. ఎస్ఐ ఆదిలక్ష్మి, ట్రైనీ ఎస్ఐ భాను, భానుప్రసన్న, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పనిచేసేవారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ మండల, క్లస్టర్, యూనిట్, వార్డు, బూత్ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పనిచేసిన టీడీపీ క్యాడర్‌ను పార్టీ ఎన్నటికీ మరిచిపోదన్నారు. కార్యకర్తల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ ఎనలేని కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, రాజశేఖర్‌రెడ్డి, కిషోర్‌నాయుడు, మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు : వ్యవసాయాధికారి


పీఏసీఎస్ కార్యాలయంలో స్టాక్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న ప్రసాదరావు

గూడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరతలేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు అన్నారు. గురువారం పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయం, పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గుర్తింపు కార్డుల ద్వారా ప్రతి ఎకరానికి మూడు బస్తాల యూరియాను సరఫరా చేస్తామన్నారు. ఎవరైనా ప్రైవేటు డీలర్లు నాశిరకం ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడుతామన్నారు. అధికారులు ధనుంజయరెడ్డి, గోపినాయక్, రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్‌రెడ్డి, సీఈవో నారాయణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మెహబూబి

గూడూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని సీడీపీవో మెహబూబి అన్నారు. గురువారం నెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాలికల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువులపై దృష్టిసారించి రాణించాలన్నారు. బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శారదాంబ, పార్వతమ్మ, హైమావతి, ఉమాదేవి, శోభారాణి, రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి


అర్జీదారులతో మాట్లాడుతున్న సుబ్బరాయుడు

డక్కిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజావిజ్ఞప్తుల దినం (పీజీఆర్ ఎస్) కార్యక్రమంలో వినతలకు సత్వర పరిష్కారం చూపాలని డివిజనల్ సర్వే అధికారి సుబ్బరాయుడు పేర్కొన్నారు. నరసనాయుడుపల్లికి చెందిన వంటిమిట్ట గంగమ్మకు 18 ఏళ్ల క్రితం డక్కిలి గ్రామ సర్వే నంబరు 112లో 36 సెంట్లు వ్యవసాయ భూమికి పట్టా మంజూరు చేశారు. తన భూమి ఎక్కడుందో తెలపాలంటూ ఆమె కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈక్రమంలో విచారించగా ప్రస్తుతం ఆ భూమి సాగులో లేనందున పాఠశాల ఆటస్థలానికి కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టాలు పొందిన లబ్ధిదారులు సాగులో ఉండాలని చెప్పారు. ఏళ్ల తరబడి సాగులో లేకపోతే ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని చెప్పారు. మండల సర్వేయర్ పెంచలయ్య, గ్రామ సర్వేయర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు


పాతనాలపాడులో ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసిన నిమ్మ మొక్కలను తొలగిస్తున్న వీఆర్ఏ

డక్కిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఎం శ్రీనివాసులు హెచ్చరించారు. పాతనాలపాడులో సర్వే నంబరు 32-12ఏలో ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించి నిమ్మ మొక్కలు నాటినట్లు అందిన ఫిర్యాదుపై గురువారం విచారణ చేపట్టారు. అనంతరం నిమ్మ మొక్కలను తొలగించామన్నారు. ఆక్రమించిన క్రిష్ణయ్యపై క్రిమినల్ కేసు నమోదయిందన్నారు. ప్రజలు కూడా భూ ఆక్రమణలు గమనిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నాయుడుపేట-శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో హోటల్‌ను నిర్వహిస్తున్న కృష్ణమనాయుడు గురువారం శ్రీకాళహస్తి వైపు మోటారు సైకిల్‌పై బయలుదేరాడు. అదే సమయంలో రాంగ్‌రూట్‌లో వచ్చి మరో మోటారు సైకిల్ ఢీకొనడంతో కృష్ణమనాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాథమిక చికిత్సఅనంతరం మెరుగైన వైద్యసేవలకు చెన్నై తరలించారు.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

సూళ్లూరుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం నుంచి ఈనెల20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ఎన్. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్య చేతుల మీదుగా ఈ వారోత్సవాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. 15న పుస్తక ప్రదర్శన, 16న వివిధ అంశాలపై ప్రముఖుల గురించి ప్రసంగాలు, 17న సెమినార్, 18న చిత్రలేఖనం, వ్యాస రచన, క్విజ్ పోటీలు,19న మహిళా దినోత్సవం ప్రాముఖ్యత, మహిళలకు సంబంధించిన అంశాలు, 20న అక్షరాస్యత దినోత్సవంతో ముగుస్తాయన్నారు.

నేడు పెళ్లకూరులో ప్రజా దర్బార్

పెళ్లకూరు, నవంబరు, 13 (ఆంధ్రజ్యోతి) : పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొంటారన్నారు. మండల ప్రజలు వారి సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు విన్నవించుకోవచ్చన్నారు.

రైలు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న యువకుడు

తడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చేనిగుంట దళితవాడ రైల్వే పట్టాల వద్ద సుమారు 25 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని యువకుడు రైలు పట్టాలు దాటేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో ఎగువ మార్గంలో చెన్నై వెళ్తున్న లోకల్ రైలు వేగంగా దూసుకురావడాన్ని గుర్తించాడు. దీంతో ఆ యువకుడు పట్టాలు దాటేందుకు ముందుకు పరిగెత్తాడు. ఈక్రమంలో రైలు అతడ్ని ఢీ కొట్టింది. అతను తీవ్ర గాయాలపాలై స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రుడ్ని మెరుగైన చికిత్స కోసం నెల్లూరు తరలించారు. అతనికి సంబంధించి ఆధారాలు లభ్యం కాలేదని రైల్వే సీఆర్‌పీ పోలీసులు తెలిపారు. తెలిసినవారు తమకు సమాచారం అందించాలని సీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు కోరారు

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి నెలరోజుల జైలు శిక్ష

వెంకటగిరిటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురికి జైలు శిక్ష విధించారు. ఈ కేసులో పట్టణానికి చెందిన మందా సురేష్, రవి, కరుణాకర్‌లను గురువారం అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. వీరికి న్యాయమూర్తి విష్ణువర్మ నెల రోజులు పాటు జైలు శిక్ష విధించారని ఆయన పేర్కొన్నారు.

150 మందికి ఉచిత వైద్య సేవలు



వెంకటగిరిటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళశాల వద్ద అమర ఆసుపత్రి(తిరుపతి) సౌజన్యంతో సమరత ఫౌండేషన్, రోటరీ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థల నేతృత్వంలో గురువారం మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 25రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని డాక్టర్ విజయ్‌కుమార్, లోకేష్, డాక్టర్లు సాయి చందన్‌లు తెలిపారు. శిబిరంలో సుమారు 150మంది పాల్గొని వైద్యసేవలను వినియోగించుకున్నారన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు విజయలక్ష్మీ, వెంకటరమణారెడ్డి, విజయ్‌భాస్కర్ రెడ్డి, బేగం, వెంకట్, శ్రీనివాసులు రెడ్డి, జానకీ రాము తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల ఫిర్యాదుపై విచారణ


ఉపాధ్యాయులు, ఎంఈవోలను విచారిస్తున్న డీప్యూటీ డీఈవో

వెంకటగిరిటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జీకేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోధ్యాయురాలు అపర్ణ తమను వేధిస్తున్నారని ఉపాధ్యాయులు చేసిన ఫిర్యాదు మేరకు గురువారం డీప్యూటీ డీఈవో సనత్‌కుమార్ విచారణ చేశారు. విచారణాంశాలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. విచారణలో ఎంఈవోలు కూడా పాల్గొన్నారు.

జలసిరి..జోరుగా సాగవుతున్న వరి

● మొంథా తుఫాన్‌తో చెరువులు కళకళ ● రబీ సాగుకు రైతుల ఉత్సాహం


చిల్లకూరులో వరినారు తీస్తున్న కూలీలు

నాయుడుపేట, నవంబరు, 13 (ఆంధ్రజ్యోతి) : గతంలో రైతులు స్వాతికార్తెలో వరి నాట్లు మొదలుపెట్టేవారు. మకరకార్తెలో ధాన్యం దిగుబడి వచ్చేది. అక్టోబరు, నవంబరు నెలల్లో వేరుశనగ, చెరుకు సాగు చేసేవారు. 20 ఏళ్ల తరువాత దీంతో పాత రోజులు వచ్చాయి. చిత్తకార్తెలో మొంథా తుఫాన్ ప్రభావంతో చెరువులకు నీరు పుష్కలంగా చేరింది. నియోజకవర్గంలో సుమారు 77 వేల ఎకరాల్లో వరిసాగుకు సమాయత్తమవుతున్నారు. దీంతో పొలాలల్లో ఎక్కడ చూసినా గట్లుపని, ట్రాక్టర్లతో దుక్కిలు చేయడం, చెక్కతోలకం, నారుపెరకడం, నాట్లు వేయడం తదితర పనులతో సందడి వాతావరణం నెలకొంది. ఒక వైపు స్వర్ణముఖినది, కాళంగినది, మరోవైపు తెలుగుగంగ, పాలచ్చూరు కాలువలు ప్రవహిస్తూ పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల చెరువులకు జలకళను తెచ్చిపెట్టాయి. చెరువులు, కుంటలు నిండుకుండలా మారడంతో భూగర్భజలాలు పెరగడంతో అధికారుల అంచనాలకు మించి వరిసాగు జరుగుతోంది. మండలాల వారీగా నాయుడుపేటలో 16 వేలు, పెళ్లకూరులో 19 వేలు, ఓజిలిలో 9 వేలు, దొరవారిసత్రంలో 14 వేలు, సూళ్లూరుపేటలో 11 వేల ఎకరాలు, తడలో 8 వేల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. మిగతా పొలాల్లో హార్టికల్చర్ పంటలను సాగుచేస్తున్నారు.

పుష్కలంగా నీరు



చంద్రగిరి నుంచి ప్రారంభమై ఏర్పేడు, శ్రీకాళహస్తి, పెళ్లకూరు, నాయుడుపేట, వాకాడు, కోట తదితర మండలాలలో స్వర్ణముఖి ప్రవహించడం ఈ ప్రాంత ప్రజలకు వరం. ఈ నది వల్ల చెరువులకే కాదు బోరు బావుల్లో కూడా నీరు పుష్కలంగా చేరుతుంది. సాగు,తాగునీరుకు ఢోకాలేదు.

దామెర ప్రసాద్‌నాయుడు, స్వర్ణముఖి నది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్

తెలుగుగంగ వరం



దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తెలుగు గంగ మంజూరుచేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ నీటిని రైతుల ముంగిటకు చేర్చారు. దీంతో నియోజకవర్గంలోని రైతులు రెండు పంటలతో లాభాలు గడిస్తున్నారు. స్వర్ణముఖినది, తెలుగుగంగ నదులు రైతులకు వరంలాంటివి.

పేరం రమేష్‌నాయుడు, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్

టీడీపీలో కార్యకర్తల మాటే శిరోధార్యం

● ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ


క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనర్లు, గ్రామపార్టీ అధ్యక్షులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట/టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కార్యకర్తల మాటే శిరోధార్యమని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట-శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో గురువారం నియోజకవర్గ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షుల చేత నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలిసి ఆమె ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ గతేడాది తరహాలోనో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా సమన్వయంతో పనిచేసి నూరు శాతం విజయం సాధించాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలతో కోటి సంతకాల సేకరణ చేపట్టారని విమర్శించారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ నెల 25 లోగా మిగతా పార్టీ నియమాకాల జాబితా ఖరారవుతుందన్నారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వూరు చంద్రారెడ్డి, విజయకుమార్‌నాయుడు, సంచి కృష్ణయ్య, శ్రీనివాసులునాయుడు, శంకరయ్య, బొమ్మన శ్రీధర్, సుదర్శన్, గోపీ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు:పీడీఎస్‌వో



మాట్లాడుతున్న అజిత

వెంకటగిరి టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళశాలలను ప్రైవేటీకరణ ప్రతిపాదనను విరమించుకోవాలని స్త్రీ విముక్తి సంఘటన(పీడీఎస్‌వో) రాష్ట్ర నాయకులు కె.అజిత డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పింజల వీరయ్య కల్యాణ మండపంలో పీడీఎస్‌వో ఏరియా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం విద్యను వ్యాపారంగా మార్చే కుట్రన్నారు. పీడీఎస్‌వో నాయకులు పవన్ మాట్లాడుతూ జీవో 107,108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పీడీఎస్‌వో కార్యదర్శి ఆశ, రాజా, మనోజ్, తేజు, లక్ష్మీ, నరసింహ, శ్రీను, ప్రవళిక, దేవి, భవాని పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంత గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సీడీపీవో మునికుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ వర్కర్లతో బాల్యవివాహాలపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా మునికుమారి మాట్లాడుతూ తీరగ్రామాల్లోని చల్లాయానాదులు, సంచార జాతుల కుటుంబాలు ఇప్పటికీ పాత ఆచారాలను అవలంభిస్తునానయన్నారు. నిబంధనల ప్రకారం నిర్దిష్ట వయసులోనే వివాహాలు చేయాలన్నారు. అతిక్రమించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు కాచి చల్లార్చిన నీటిని అందించాన్నారు. లేనిపక్షంలో సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సూపర్ వైజర్లు కృష్ణమ్మ, కవిత, సుబ్బమ్మలు ఉన్నారు.

పరిశుభ్రతతో పర్యావరణ పరిరక్షణ


స్వచ్ఛభారత్‌పై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న చైతన్య భారతి కళాసేవ సంస్థ సభ్యులు

తడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని చైతన్య భారతి కళాసేవా సంఘం కళాజాత బృందం పేర్కొంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు సదరు సంస్థ గ్రామ గ్రామాన పారిశుద్యం, ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలపై బజారుకూడలిలో గురువారం కళాజాత అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు, పారిశుద్యం వంటి విషయాలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయప్రద, పంచాయతీ కార్యదర్శి గాబ్రియల్, మస్తాన్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ


వెంకన్నపాళెంలో సంతకాలు పెడుతున్న గ్రామస్థులు

కోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేయరాదంటూ కర్లపూడి, వెంకన్నపాళెం గ్రామాల్లో గురువారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తే ప్రతిభావంతులైన పేద విద్యార్థులు నష్టపోతారన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, రమణయ్య, శ్రీనివాసులు, రేష్మా ఉన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

బాలాయపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కయ్యూరు పీఏసీఎస్ పరిధిలోని రైతులకు పీఏసీఎస్ చైర్మన్ సీసీ నాయుడు గురువారం యూరియా పంపిణీ చేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు అవసరం మేరకు మాత్రమే యూరియా వినియోగించాలని రైతులకు సూచించారు. యూరియా వాడడం వలన ఎంత నష్టం వాటిల్లితుందో విశదీకరించారు. కార్యక్రమంలో ఏవో విజయలక్ష్మి, కయ్యూరు నీటి సంఘం డైరెక్టర్ వీరేపల్లి శివకుమార్, వెంగమాంపురం గ్రామ టీడీటీ అధ్యక్షుడు దామ మధు, బీల్ గోవర్ధన్ యాదవ్, వేముల వరాలు, గొట్టి మోహన్ రాము, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పడిపూజకు వైభవంగా ధ్వజారోహణం



అయ్యప్ప ఆలయంలో పూజలు

చంద్రగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె వద్ద వెలసిన సుందరగిరి అయ్యస్వామి ఆలయంలో పడి పూజ మహోత్సవానికి గురువారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పడిపూజ మహోత్సవాలలో భాగంగా సాయంత్రం ఆలయశుద్ధి తరువాత మూలవిరాట్‌కు వివిధ రకాల అభిషేకాలు,ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ధ్వజారోహణం నిర్వహించారు. అయ్యప్పస్వామి నామస్మరణల నడుమ ఆలయ ట్రస్టీ లెక్కల పురుషోత్తంనాయుడు పడిపూజ మహోత్సవానికి ధ్వజ పటాన్ని ధ్వజంపైకి ఎగురవేశారు.

ఎర్రచందనం స్వాధీనం

ఎర్రావారిపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి); కారులో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తుండ దాడి చేసి స్వాధీనం చేసుకొన్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. విరాలు ఇలా ఉన్నాయి . మండలంలోని ఉస్తికాయల పెంట, ఎల్లమంద గ్రామాల నుండి కారులో ఎర్రచందనం తరలిపోతుందనే సమాచారం మేరకు తాము మాటు వేసి గురువారం ఉదయం వేకువ ఝూమున 3 గంటలకు కారుతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. పట్టుబడిన ఎర్రచందనం 150 కేజీలు ఉంటుందని తెలిపారు. ఈ దాడిలో అటవీ సిబ్బంది మునిస్వామి నాయక్ ,రాజేష్, సదాశివయ్య, రోహిత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. 300కేజీల ఎర్రచదనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు.

పగిలిన పైపులైన్... వారం రోజులుగా అవస్థలు


పైపు లైన్ నుంచి పేడదిబ్బల్లోకి వెళ్తున్న తాగునీరు- దిగువ ప్రాంతాలకు రంగు మారి వెళ్తున్న నీరు

కోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కేంద్రమైన తిన్నెలపూడిలో పైపులైన్ పగిలింది. దీంతో స్వచ్ఛమైన స్వర్ణముఖిజలాలు వృథాగా పోతున్నాయి. స్థానిక చెంబడిపాళెంలో ఫిల్టర్ పాయింట్ వేసి పైపులైన్‌ల ద్వారా తిన్నెలపూడి గ్రామానికి తాగునీరు సరఫరా చేస్తున్నారు. వారం రోజులక్రితం ఊర్లోకి వెళ్లే పైపులైన్ పగిలిపోయి తాగునీరంతా పేడదిబ్బ పాలవుతుంది. తాగునీరంతా రంగు మారి గ్రామంలోని దిగువ నివాసాలకు వెళ్తోందని, తాము తాగడానికి ఇబ్బంది పడుతున్నామని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగితే రోగాల బారిన పడతామని వీరంతా ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించండి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక రాజు

నారాయణవనం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోక రాజుపేర్కొన్నారు. గురువారం కళాశాలలో ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ(అపిటా) ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ పూల్ క్యాంపస్ జాబ్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించారు. ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగాలకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ డ్రైవ్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లా, నెల్లూరు నుంచి బీటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ ఉత్తీర్ణులు హాజరయ్యారన్నారు. మొత్తం 46 కళాశాలల నుంచి సుమారు 6వేల విద్యార్థులు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అశోక రాజు మాట్లాడుతూ... జాబ్ డ్రైవ్‌లో పాల్గొన్న విద్యార్థులు తమ లక్ష్య సాధనలో ముందుండాలన్నారు. జాబ్ డ్రైవ్ ఈనెల 16న ఆదివారం వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జనార్దన రాజు, అపిటా మేనేజర్లు లక్ష్మీప్రసాద్, అనిల్, ఇన్ఫోసిస్ నుంచి దిషా, ప్రియాక్ష, ప్లేస్‌మెంట్ అధికారి మణిమోహన్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

సత్యవేడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా సమస్యలపై ట్రాన్స్‌కో ప్రత్యేక దృష్టి సారించినట్లు సత్యవేడు ఏఈ వాసుదేవయ్య తెలిపారు. తిరుపతి ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఆదేశాల మేరకు అన్ని క్యాడర్ల అధికారులు నేరుగా వినియోగదారులతో మొబైల్ ద్వారా మాట్లాడి సమస్యలను తెలుసుకుంటారన్నారు. ప్రతి సోమవారం క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న జేఎల్ఎం, ఏఎల్ఎం సిబ్బంది పదిమంది వినియోగదారులకు ఫోన్ చేసి విద్యుత్ సమస్యలపై ఆరా తీయాలన్నారు. విద్యుత్ సరఫరా, లోఓల్టేజీ సమస్యపై ప్రతి మంగళవారం లైన్‌మన్, బుధవారం లైన్ ఇన్‌స్పెక్టర్, గురువారం సామాజిక ఏఈ 20 మంది వినియోగదారుల సమస్యలను తెలుసుకోవాలన్నారు. శుక్రవారం డీఈఈ 30 మంది వినియోగదారులతో, శనివారం పుత్తూరు ఈఈ 40 మంది విద్యుత్ వినియోగదారులతో సరఫరా, సమస్యలను తెలుసుకోవాలన్నారు. వారం పాటు వినియోగదారుల నుంచి వచ్చిన సమస్యలను క్రోడీకరించి నివేదికను ఉన్నతాధికారులకు పంపాలన్నారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజీ సమస్యలు వంటివి తెలుసుకుని సమస్యను పరిష్కరించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



దర్శనానంతరం ఎంపీ హరీష్‌ద్వివేది, స్నేహా దంపతులు

శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఉత్తరప్రదేశ్ ఎంపీ హరీష్ ద్వివేది, సినీనటి స్నేహ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పుత్తూరు వార్తలు

ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ శిబిరం



పుత్తూరు టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసినా ఆధార్ శిబిరాన్ని ప్రజల సద్వినియోగం చేసుకో వాలని ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు, చిరునామా, పుట్టిన తేది మార్పులు, చేర్పులు, ఫోన్ నెంబర్ లింక్ తదితరాలు చేసుకోవచ్చని తెలిపారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం



ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

పుత్తూరు అర్బన్, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ధనపాల్ ఆధ్వర్యంల సత్కరించారు. గురువారం తిరుపతిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. తనపై నమ్మకంతో పదవిని ఇప్పించిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటానని ధనపాల్ అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ అమ్ములు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గణేష్, పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ముస్లిం మైనారిటీల కృతజ్ఞతలు

పుత్తూరు అర్బన్, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాల కోసం రూ.90 కోట్లు మంజూరు చేసిన సీఎం చంద్రబాబుకు పుత్తూరు పట్టణ ముస్లిం మైనార్టీలు గురువారం ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందనడానికి ఇమామ్‌కు రూ.10 వేలు, మౌజన్‌కు రూ.5 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లింపులే నిదర్శనమన్నారు. మతవల్లీ మహమ్మద్‌గౌస్, మత పెద్దలు మజీద్ సాహెబ్, షబ్బర్, హమీద్ బాషా, ఖలీల్ బాషా, జాఫర్, రఫీ, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే నివాళి

వడమాలపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో మృతి చెందిన ఎస్వీఆర్‌పురానికి చెందిన టీడీపీ నాయకుడు బాబురాజు మృతదేహానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నివాళులర్పించారు. తడుకు ఆర్. ఎస్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో బాబురాజు మృతి చెందారు. పార్టీలో క్రియాశీలకంగా ఉన్న బాబు రాజు అలియాస్ నరసింహ రాజు మృతి టీడీపీకి తీరనిలోటని ఎమ్మెల్యే అన్నారు. బాబురాజు కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసానిచ్చారు.

బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



వడమాలపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి- చెన్నై జాతీయ రహదారి ఎస్వీపురం టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు. తిరుపతికి చెందిన బాంబ్ స్క్వాడ్, జాగిలంతో బస్సులు, కార్లలో తనిఖీలు చేపట్టారు. ఢిల్లీలోని ఎర్రకోట కారు పేలుడు దుర్ఘటన నేపథ్యంలో జరిగిన తనిఖీలకు స్థానిక పోలీసులు సహకరించారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



నిఖిల్ (ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఎస్ఎస్ పురం వద్ద టి.ఆర్.కండ్రిగ కాలనీ బస్‌స్టాప్ వద్ద వేచి ఉన్న అదే గ్రామానికి చెందిన నిఖిల్(18)ను అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీ కొంది. గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. టీఆర్ కండ్రిగకు చెందిన విజయ్‌కుమార్ కొడుకు నిఖిల్ పుత్తూరుకు వెళ్లి కూరగాయలు తెచ్చేందుకు బస్‌స్టాప్ వద్ద వేచివున్నాడు. పుత్తూరు వైపు వెళ్లే ట్రాక్టర్‌ను డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడంతో బస్టాప్‌లో వేచివున్న నిఖిల్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో నిఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన

శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా వ్యక్తిగత, సామాజిక శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ, అధ్యాపకులు బాపనయ్య, సాయి వెంకటేష్, సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సారూ... వీధి కుక్కల సంతతి అరికట్టరూ!



జయరామరావువీధిలో గుంపుగా సంచరిస్తున్న వీధికుక్కలు

శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయరామరావు వీధిలో వీధికుక్కల బెడల అధికంగా ఉంది. పట్టణ నడిబొడ్డులో ఈ ప్రాంతం ఉంది. ఇక్కడ వీధికుక్కల సంతతి అంతకంతకు పెరిగిపోతోంది. నిత్యం ప్రజలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. గుంపుగా రోడ్లపైనే వీధి కుక్కలు తిష్ఠ వేస్తున్నాయి. ఉదయం, రాత్రివేళల్లో వీధలో రాకపోకలు సాగించే పిల్లలపై కుక్కలు మూకుమ్మడిగా దాడులు చేస్తున్నాయి. పలురువు గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కళత్తూరులో చీరలు, దుప్పట్ల పంపిణీ

కేవీబీపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరు దళితవాడలో ముంపునకు గురైన ప్రాంతాల్లో గురువారం శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన పిళ్లారి ఫౌండేషన్ అధినేత అమరావతి బాధితులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. సురేష్‌రెడ్డి, థామస్, కేవీబీపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఇక అదే విధంగా ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో వంట సామగ్రి, ఇతర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, కవిత సుజాత, అప్సరా తదితరులు పాల్గొన్నారు.

అరణియార్‌ను ఆధునికీకరించండి
ఎమ్మెల్యే ఆదిమూలం

శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జైకా నిధులు రూ.35 కోట్లతో గతంలో ప్రారంభించిన పనులు పది శాతం మాత్రమే పూర్తి చేసి కాంట్రాక్టర్ చేతులెత్తేశారని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. అరణియార్‌లో చేప పిల్లలు వదిలిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇంకా రూ.28 కోట్ల పనులు మిగిలి ఉన్నాయన్నారు. పాతకాంట్రాక్టును రద్దు చేసి మళ్లీ టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టాలని కోరారు. ఇదే విషయమై అసెంబ్లీలో ప్రస్తావించానని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ ప్రక్రియపై దృష్టి సారించాల కోరారు.

బాలాజీకి మాధవ్ అభినందనలు



రేణిగుంట, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బీడీ బాలాజీని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అభినందించారు. గురువారం తిరుపతిలో జరిగిన కార్యక్రమానికి మాధవ్ హాజరై తిరుగు ప్రయాణమయ్యారు. రేణిగుంట కొత్త చెక్ పోస్ట్ కూడలి వద్ద మాధవ్‌ను రేణిగుంట బీజేపీ నాయకులు పలకరించారు. ఈ సందర్భంగా బాలాజీని మాధవ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలాఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తేజవతి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపిఆచారి తదితరులు పాల్గొన్నారు.

కంకర టిప్పర్ బోల్తా



వరదయ్యపాళెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఒక వైపు నిద్రమత్తు... మరోవైపు అధిక లోడ్.. చెన్నైకు వెళుతున్న టిప్పర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. మండలంలోని ఓ క్వారీ నుంచి కంకరను చెన్నైకు తరలిస్తున్న టిప్పరు సత్యవేడు రహదారి మార్గంలోని యానాదివెట్టు వద్ద అసంపూర్తిగా సిమెంటు రోడ్డుపై దూసుకెళ్లి అదుపు తప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. స్థానికులు విద్యుత్ ఉపకేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సరఫరాను నిలిపివేశారు. దీంతో ప్రాణనష్టం తప్పింది. డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

భరద్వాజతీర్థంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయండి

శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థంలో భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని హిందూ ధార్మికమండలి కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు కోరారు. గురువారం ఆయన సభ్యులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు ఎక్కువ సంఖ్యలో ఈ ప్రాంతానికి వస్తున్నారన్నారు. దీంతో సందర్శకుల తాకిడి పెరిగిందన్నారు. అయితే అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయడంలో ఆలయ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని చెప్పారు. మూడు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన నిర్మించిన మరుగుదొడ్లు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు. అదే విధంగా స్నాన ఘట్టాలు, తాగునీటి వసతిఏర్పాటు చేయాలన్నారు. దీనిపై అధికారులు స్పందించాల్సి ఉందని ఆయన కోరారు. చిలకా రంగయ్య, కన్నా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు



ప్రమాణ స్వీకారం చేస్తున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పార్టీ విజయం కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఇవ్వడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడిగా విజయ కుమార్, తొట్టంబేడు మండల అధ్యక్షుడుగా రావిళ్ల మునిరాజా నాయుడు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అదే విధంగా గ్రామ, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ లెవల్ ఏజెంట్లు ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా ఎమ్మెల్యే ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. టీడీపీ నాయకులు కంఠా రమేష్, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయకుమార్‌కు సన్మానం



శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడిగా గడిపూడి విజయకుమార్ రెండోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు గురువారం ఆయన్ను సన్మానించారు. మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నింద్ర సుధాకర్, హిమ్మత్‌కుమార్, విజయనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్‌లో మెటల్ డిటెక్టర్‌తో బ్యాగుల తనిఖీ

శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో పోలీసు అధికారులు గురువారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు, పార్శిల్ కేంద్రాల్లో సోదాలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులను ఆరా తీశారు. ప్రజలను ఎక్కడికక్కడ అప్రమత్తం చేశారు. అసాంఘిక, అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ నాగార్జునరెడ్డి, బాంబు డిస్పోజబుల్ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయం వద్ద...



రేణిగుంట (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు కొనసాగి స్తోంది. ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో గురువారం విమానాశ్రయానికి వచ్చిన ప్రతి వాహనాన్ని విమానాశ్రయ భద్రత దళాలు, ఎయిర్‌పోర్ట్ పో లీసులు, బాంబ్ స్క్వాడ్ తనిఖీ చేశారు.

మహిళా సంఘ సభ్యులు ఆర్థికంగా ఎదగాలి

రేణిగుంట, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘం సభ్యులు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ జిల్లా అధికారి శోభన్ బాబు అన్నారు. రేణిగుంట మండల మహిళా సమైక్య కార్యాలయంలో జరిగన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శిక్షణ పొందిన మహిళలు వార్షిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని జీవన ఆర్థిక ప్రమాణాలు మెరుగుపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ప్రభావతి, డీపీఎం వెంకటేష్, ఏపీఎం రాధమ్మ, వెలుగు ఏపీఎం కోమలాదేవి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే శారీరక ఎదుగుదల

సత్యవేడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే పిల్లల్లో శారీరక ఎదుగుదల సాధ్యమని సీడీపీవో దేవకుమారి తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో టాటా చారిటబుల్ ట్రస్టు, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన న్యూట్రిషన్ ప్రోగ్రాంలో ఆమె మాట్లాడుతూ.. పిల్లల వయసు ఆధారంగా వారి శారీరక ఎదుగుదలను నమోదు చేయాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదే అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నట్లు ట్రస్టు కో-ఆర్డినేటర్ సుప్రియ చెప్పారు. సత్య వేడు, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ మండలాల్లోని 179 అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు లైసెన్సు తప్పని సరి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. బీఎన్‌కండ్రిగ ప్రధాన రహదారి కూడలిలో ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహనదారుల రికార్డులను పరిశీలించారు. డ్రైవర్లు ఆటోలకు సంబంధించిన అన్ని రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు డ్రైవింగ్ నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా చూచుకోవాలన్నారు. పీఎస్ఐ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

మొబైల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండండి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొబైల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. మడలంలోని కనమనంబేడు లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం మొబైల్‌ఫోన్లు, టీవీల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చదువుపై దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. సమాజంలో చదువుతోనే ఉన్నత స్థానం వస్తుందన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయం

రేణిగుంట నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయం పొందవచ్చని రాస్ కె.వి.కె హెడ్ శ్రీనివాసులు చెప్పారు. మండలంలోని చైతన్య పురంలో రాస్ కె.వి.కెలో పుట్టగొడుల పెంపకంపై మూడు రోజుల శిక్షణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకం స్వయం ఉపాధికి ఉపయోగపడుతుందన్నారు. అలాగే కృషి విజ్ఞాన కేంద్రంలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కె.వి.కె శాస్త్రవేత్తలు దివ్య, రామ్ కుమార్, అనూష, ఉమ్మడి జిల్లా నుంచి రైతులు హాజరయ్యారు.

టెన్త్ పరీక్షా సెంటర్ పరిశీలన



ఏర్పేడు జడ్పీ పాఠశాలను తనిఖీ చేసి వస్తున్న అధికారులు

ఏర్పేడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండల కేంద్రంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతిపరీక్షా కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల అధికారి అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామి గురువారం పరిశీలించారు. ఆయనతో పాటు ఎంఈవో దయాకర్, ప్రధానోపాధ్యాయురాలు మునిలక్ష్మి ఉన్నారు. పరీక్షల కేంద్రంలో కల్పించాల్సిన సౌకర్యాలపై పలు సూచనలు చేశారు. పరీక్షలు నిర్వహించే తరగతి గదులను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు సౌకర్యంగా విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, టెబుళ్లను ఏర్పాటు చేయాలన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురువారాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ, వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకించారు. సుగంధభరిత పూలు, స్వర్ణాభరణాలతో అలంకరించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. పర్వత, చక్ర, కుంభ, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఫిర్యాదులు వస్తే చౌకదుకాణ డీలర్లపై చర్యలు

కేవీబీపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చౌకదుకాణ డీలర్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని తహసీల్దారు రోశయ్య హెచ్చరించారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నిత్యావసర వస్తువుల కొలతల విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఏ సకాలంలో సరుకులను పంపిణీ చేయాలన్నారు. అలాగే ప్రతి రేషన్ దుకాణం వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

యూత్ యాక్టివిటీస్ పోటీల్లో ఎంజీఎం విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ యాక్టివిటీస్ పోటీల్లో ఎంజీఎం విద్యార్థులు ప్రతిభ చూపారు. సీనియర్ డ్రాయింగ్ పోటీల్లో హర్షవర్ధన్ రెండవ బహుమతి, వక్తృత్వ పోటీల్లో ఉన్నతి సాయి మొదటి బహుమతి సాధించింది. ఫ్యాన్సీ డ్రెస్ విభాగంలో సంతోషిని, సీనియర్ ఫాన్సీ విభాగంగా మహవిన్ సుల్తానా బహుమతులు గెలచుకున్నారు. వీరిని ఎంజీఎం డైరెక్టర్ ఐశ్వర్య అభినందించారు.